క్లుప్తంగా

మరిడమ్మ ఆలయంలో భక్తుల రద్దీ



ఆలయంలో అన్నప్రసాదాన్ని స్వీకరిస్తున్న భక్తులు

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా పేరొందిన పెద్దాపురం మరిడమ్మ ఆలయానికి ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కె.వి జయలక్ష్మి ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి వారం నిర్వహించే అన్నదానానికి భక్తులు అధిక సంఖ్యలో పెరిగారు. ఈఓ విజయలక్ష్మి మాట్లాడుతూ దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం వేసవి భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

సామర్లకోట: స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతులు చేపడుతున్న కారణంగా పట్టణ పరిధిలో పలు ప్రాంతాలకు సోమవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు ఏపీఎస్‌డీఎస్ ప్రభాకర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 33/11 కేవీ మరమ్మతులను చేస్తుండడంతో ఉప్పువారి సత్రం, పాత తహసీల్దార్ కార్యాలయం, కొత్తపేట, చిన్నవీధి, బలుసుపేట, సంగీతరావుపేట, నీలమ్మచెరువు, ఇందిరా కాలనీ, పెన్షన్‌లైన్, పేరంటాలపుంత ప్రాంతాలకు ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, అందరూ సహకరించాలని కోరారు.

పాదాలమ్మ నూతన ఆలయ నిర్మాణం



పాదాలమ్మ అమ్మవారు

సామర్లకోట: పి.వేమవరం గ్రామ దేవతగా ప్రసిద్ధి చెందిన శ్రీపాదాలమ్మ అమ్మవారికి నూతన ఆలయ నిర్మాణం జరుగుతున్నట్టు ఆలయ కమిటీ నాయకులు తెలిపారు. పూరాతన ఆలయం శిథిలం కావడంతో భక్తులు, దాతల సహకారంతో ఆలయాన్ని పునర్నిర్మిస్తున్నారు. ఈ మేరకు పనసపాడు గ్రామానికి చెందిన దేవి శ్రీ ఫుడ్స్ యాజమాన్యం రూ.50 వేలు విరాళంగా ఇచ్చారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



గొల్లప్రోలు రైల్వే స్టేషన్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

పిఠాపురం: ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో ప్రజలందరూ అన్ని వేళలా అప్రమత్తంగా ఉండాలని గొల్లప్రోలు ఎస్సై ఎన్.రామకృష్ణ విజ్ఞప్తి చేశారు. ఆయన జిల్లా ఎస్పీ బిందుమాధవ్ ఆదేశాల మేరకు ఆదివారం గొల్లప్రోలులో వివిధ ప్రధాన ప్రాంతాల్లో విస్తృత తనిఖీలు నిర్వహించారు. రైల్వేస్టేషన్, బస్టాండ్, రద్దీగా ఉండే ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించిన ఆయన ప్రజలకు పలు సూచనలు చేశారు. అపరిచిత వ్యక్తులు గానీ వస్తువులు గానీ కనిపిస్తే వెంటనే పోలీసులకు 100 నంబర్ ద్వారా సమాచారం ఇవ్వాలన్నారు. అనుమానితులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని మనకెందుకులే అన్నట్టుగా ఉండకుండా మన ప్రాంత రక్షణ మన అందరి బాధ్యతగా తీసుకోవాలని ఆయన సూచించారు. ప్రతి నిముషం అప్రమత్తంగా ఉండాలని వ్యాపారులకు, రైల్వే స్టేషన్ సిబ్బందికి సూచించారు.

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

కాకినాడ రూరల్: పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన పేద కాపు విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను కాపు ఉద్యోగ సేవా సమితి ఆధ్వర్యంలో స్థానిక ఆర్ఆర్ నగర్‌లోని శుభం కాపు కల్యాణ మండపంలో ఆదివారం అందజేశారు. కాపు విద్యా భరోసా పథకం కింద ఐదుగురు విద్యార్థులను ఎంపిక చేసి ఇంటర్మీడియెట్ విద్యాభ్యాసానికి అయ్యే ఖర్చును కాపు ఉద్యోగ సేవా సమితి భరించనుంది. పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన 70 మంది విద్యార్థులను ప్రతిభా పురస్కారాలు అందించి సన్మానించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా వైజాగ్ జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్‌గా పని చేస్తున్న చేబ్రోలుకు చెందిన ఉలవకాయల నూకరాజు, కేయూఎస్ఎస్ నేతలు బావిశెట్టి లక్ష్మీనారాయణ, దొరబాబు, ముమ్మిడిశెట్టి వెంకటరమణ, కనపర్తి నూకరాజు, యంగ్‌మెన్స్ అసోసియేషన్ వాకాడ చిన్న, టీవీవీ సత్యనారాయణ, ఉదయ్ భాస్కర్, శ్రీనివాస్, మోహన్, ఆదిత్య మూర్తి, పద్మజ తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్ష.. పుడమికి రక్ష

- పరీక్షలతో నేల స్వభావంపై కచ్చితమైన అంచనా
- ఫలితాల ఆధారంగా ఎరువుల వినియోగం
- అధిక దిగుబడికి అవకాశం



భూసార పరీక్షలు చేస్తున్న వ్యవసాయ సిబ్బంది



మట్టి నమూనా సేకరణను పరిశీలిస్తున్న ఏడీ స్వాతి, ఏఓ జోగిరాజు తదితరులు

కొత్తపల్లి: వ్యవసాయంలో పెట్టుబడి తగ్గి దిగుబడి పెరగాలంటే భూసార పరీక్షలు కీలకమని నిపుణులు పేర్కొంటున్నారు. సాగుభూమిలో భూసార పరీక్షలు చేయించడం వల్ల నేలలోని పోషకాలు, లోపాలు, ఆమ్ల, క్షార, స్థితి, చౌడు, ఇతర సమస్యలు తెలుస్తాయి. దీంతో అవసరమైన ఎరువులు మాత్రమే వినియోగించడం వల్ల అనవసర వ్యయం తగ్గుతుంది. వ్యవసాయం లాభసాటిగా ఉండాలంటే తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి పొందే మార్గాలను అనుసరించాలి. భూమిలో ఉన్న పోషకాలు, లోపాలు తెలుసుకుని వాటికి అనుగుణంగా పంటల సాగు, ఎరువుల వినియోగానికి భూసార పరీక్షలు ఎంతగానో దోహదపడుతాయి. అధికా దిగుబడి సాధించే లక్ష్యంతో కొంత మంది అన్నదాతలు రసాయన ఎరువులు, పురుగుమందులు అవసరానికి మించి వినియోగిస్తుండడంతో భూమిలో పోషకాలు నశిస్తున్నాయి. దీంతో నత్రజని తగ్గి భూమి ఉత్పాదక శక్తిని కోల్పోయి చౌడుబారడంతో పాటు చీడపీడల ఉధృతి పెరుగుతోంది. భూసార పరీక్షలతో నేల భౌతిక, రసాయన లక్షణాలు తెలుసుకునేందుకు అవకాశం కలుగుతుందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

నమూనాల సేకరణలో జాగ్రత్తలు

పంటకోత పూర్తైన తర్వాత, వేసవి పంటలు లేని సమయాల్లో మట్టి నమూనాలు సేకరించాలి. పొలాలకు సాగునీరు పెట్టినప్పుడు, ఎరువులు వేసిన తర్వాత మట్టి నమూనాలు సేకరించకూడదు. పొలాల్లో నీడ పడే ప్రదేశాలు, గట్టు, చెట్లు ఉన్న ప్రాంతాల్లో మట్టి నమూనా తీయకూడదు. ముందుగా నేలపైన ఉన్న గడ్డి, చెత్త, కలుపు మొక్కలు తీసి వేయాలి. వరి పొలంలో వీ ఆకారంలో 15–20 సెంటీమీటర్ల లోతున పారతో గుంత తీసి పైసార నుంచి కింద వరకూ ఒక పక్కగా మట్టిని సేకరించాలి. వ్యవసాయ క్షేత్రంలో జెడ్ ఆకారంలో సుమారు ఎనిమిది ప్రదేశాల్లో సేకర్చిన మట్టిని క్వార్టరింగ్ విధానంలో భాగా కలిపి అరకేజీ బరువు వచ్చేలా తీసుకుని నీడలో ఆరబెట్టాలి. మట్టి బాగా ఆరిన తర్వాత పాలిథిన్ కవర్‌లో నింపి రైతు వివరాలు సర్వే నంబర్ విస్తీర్ణం, గతంలో సాగు చేసిన పంట తదితర వివరాలు నమోదు చేసి పరీక్ష క్షేత్రాలకు పంపుతారు. వ్యవసాయ పంటలు పండించే భూముల్లో 6 అంగుళాల లోతు నుంచి నమునా సేకరించాలి. మండలంలో మొత్తం సుమరు 6073 వేలకు పైగా రైతులు సుమరు 10254 ఎకరాల్లో ఖరీఫ్‌లో రైతులు సాగు చేస్తున్నారని వ్యవసాయాధికారులు అంచనా వేస్తున్నారు.

భూసార పరీక్షలతో మేలు



భూసార పరీక్షల ఆధారంగా ఏ పంటకు ఎంత మోతాదులో పోషకాలు అవసరమో తెలుస్తుంది. దీంతో భూమిలో లోపించిన పోషకాలను గుర్తించి దాని అనుగుణంగా ఎరువులను వినియోగించవచ్చు. అప్పుడు పెట్టుబడి ఖర్చు తగ్గించుకోవచ్చు. పంటలకు అవసరమైన పోషకాలను రసాయన రూపంలో కంటే సేంద్రియ సీవన ఎరువుల రూపంలో అందించడం ద్వారా ఖర్చులు తగ్గి నాణ్యమైన దిగుబడి పొందవచ్చు. మండలంలో ఒక్కొక్క రైతు భరోసా కేంద్రం పరిధిలో 200 శాంపిల్స్ సేకరించవచ్చు. వ్యవసాయ సిబ్బందికి రైతులు సహకరించాలి. మండంలో సుమారు 1026 పరీక్షలు చేయాలని లక్ష్యం పెట్టుకోవాడం జరిగింది.

– వి.జోగిరాజు, మండల వ్యవసాయాదికారి, కొత్తపల్లి

ఇసుక అక్రమ రవాణా

- బొండు ఇసుక అక్రమ తవ్వకాలు
- జోరుగా కూటమి నాయకుల వ్యాపారం
- పట్టించుకోని అధికారులు

కొత్తపల్లి: రమణక్కపేటలో అక్రమ బొండు ఇసుక తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. రాత్రి పగలూ తేడా లేకుండా బొండు ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. ఎటువంటి అనుమతులు లేకుండా గుట్టు చప్పుడు కాకుండా బొండు ఇసుక వ్యాపారం జోరుగా సాగిస్తున్నారు. పట్టించుకోవాల్సిన సంబంధిత అధికారులు తమకు ఏమి పట్టనట్లుగానే వ్యవహరిస్తున్నారని ఆరోపణలు సైతం వినిపిస్తున్నాయి. కూటమి నాయకులు అధికారులను మభ్యపెట్టి మామూళ్లు ముట్టజెప్పి ఇసుకదందాకు పాల్పడుతున్నారు. ఆలయాల నిర్మాణం పేరుతో బొండు ఇసుక తవ్వకాలు చేపట్టి ట్రాక్టర్లతో ఇసుక తవ్వకాలను చేపట్టి వ్యాపారానికి పాల్పడుతున్నారు. స్థానిక అధికారులను సైతం భయపెట్టి బొండు ఇసుక తవ్వకాలు చేపడుతున్నారని ఆరోపణలు సైతం వినిపిస్తున్నాయి. ముఖ్యంగా రాత్రి సమయాల్లో వ్యాపారం మరింత జోరుగా సాగుతోంది. దీనిపై తహసీల్దారును వివరణ కోరగా బొండు ఇసుక తవ్వకాలకు రెవన్యూ పరంగా ఎటువంటి అనుమతులు ఇవ్వలేదు. తక్షణమే స్థానిక రెవన్యూ అధికారులను పంపి తవ్వకాలను నిలిపివేసి నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామన్నారు.

మున్సిపల్ చైర్‌పర్సన్‌పై 15న అవిశ్వాసం

సామర్లకోట: ఈనెల 15వ తేదీన మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణపై ఆ పార్టీ చెందిన కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానం పెట్టే అవకాశం ఉంది. మున్సిపల్ చైర్‌పర్సన్‌గా వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ దవులూరి దొరబాబు తల్లి దవులూరి పార్వతికి ఇవ్వాల్సి ఉంది. అయితే కుటుంబంలో ఒకే పదవి అనే నినాదంతో దొరబాబు తన తల్లికి దక్కాల్సిన చైర్‌పర్సన్ పదవిని 27వ వార్డు కౌన్సిలరుగా ఎంపికైన గంగిరెడ్డి అరుణ, దొరబాబు కేటాయించారు. దాంతో ఆమెను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

31 మంది సభ్యులు ఉన్న సామర్లకోట మున్సిపాలిటీలో 29 మంది సభ్యులు వైఎస్సార్ సీపీ నుంచి ఎన్నికయ్యారు. ఇద్దరు మాత్రమే టీడీపీ నుంచి ఉన్నారు. 26వ వార్డు కౌన్సిలర్ అనారోగ్యంతో మృతి చెందారు. సార్వత్రిక ఎన్నికలకు ముందు వైఎస్సార్ సీపీకి చెందిన ఇద్దరు కౌన్సిలర్లు టీడీపీలోకి చేరారు. దాంతో టీడీపీ బలం నాలుగుకు చేరింది.

మున్సిపల్ చైర్‌పర్సన్ పార్టీకి చెందిన సభ్యులకు ప్రాధాన్యత ఇవ్వకపోవడంతో వైఎస్సార్ సీపీకి చెందిన కౌన్సిలర్లు దవులూరి దొరబాబు దృష్టికి తీసుకువెళ్లారు. దాంతో ఆమెను రాజీనామా చేయాలని పట్టణ పార్టీ అధ్యక్షుడిచే చెప్పించారు. దవులూరి పార్వతి చైర్‌పర్సన్ పదవి ఇస్తామంటే రాజీనామా చేస్తానని, ఇతరులకు కేటాయిస్తే రాజీనామా చేసేది లేదని చెప్పినట్టు తెలిసింది. దాంతో గత నెల 2వ తేదీన 22 మంది వైఎస్సార్ సీపీకి చెందిన కౌన్సిలర్లు తమకు బలనిరూపణకు అవకాశం ఇవ్వాలని కలెక్టరు షణ్మోహన్‌కు, మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్యకు వినతిపత్రాలు అందజేశారు. దాంతో ఈనెల 15వ తేదీన జిల్లా కలెక్టరు బలనిరూపణ చేసుకోవడానికి అవకాశం ఇచ్చారు.

ఈ కార్యక్రమానికి కాకినాడ ఆర్డీఓ మల్లిబాబును ప్రత్యేకాధికారిగా కలెక్టరు నియమించినట్టు తెలిసింది. కాగా మున్సిపల్ చైర్‌పర్సన్ బల నిరూపణ జరగకుండా అడ్డుకునే విధంగా హైకోర్టును ఆశ్రయిస్తున్నట్టు తెలిసింది. ఈ నెల 15న ఏమి జరుగుతుందా అని పట్టణ ప్రజలు ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు.

రేపు తహసీల్దార్ కార్యాలయం ప్రారంభం

సామర్లకోట: తహసీల్దార్ కార్యాలయ నూతన భవనం మంగళవారం ప్రారంభించనున్నట్టు తహసీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఉన్న తహసీల్దార్ కార్యాలయం శిథిల స్థితికి చేరడంతో బలుసులపేట అల్లూరి సీతారామరాజు పార్కు వద్ద నిరుపయోగంగా ఉన్న ఐసీడీఎస్ భవనంలోని మార్పు చేసుకోవాలని ఎమ్మెల్యే రాజప్ప సూచించారన్నారు. ఈ మేరకు ఈ విషయాన్ని జిల్లా కలెక్టరు షణ్మోహన్ దృష్టికి తీసుకు వెళ్లడంతో భవనం మరమ్మతులకు కావలసిన నిధులు మంజూరు చేశారని తెలిపారు. ఈ నిధులతో భవన మరమ్మతు పనులతో పాటు దాతల సహకారంతో రంగులు వేయించడం జరిగిందన్నారు. ఇటీవల ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప కార్యాలయాన్ని పరిశీలించి ఈనెల 13వ తేదిన ప్రారంభించడానికి ఖరారు చేశారన్నారు. ఎమ్మెల్యే అధ్యక్షతన రెవెన్యూశాఖ మంత్రి ఈ భవనాన్ని ప్రారంభిస్తారని తెలిపారు. అదే రోజు నుంచి నూతన భవనం నుంచి రెవెన్యూ సేవలు ప్రారంభమవుతాయని చెప్పారు.

వీర జవాన్ మురళి నాయక్‌కు ఘన నివాళి



వీర జవాన్‌కు నివాళలర్పిస్తున్న సహృదయ మిత్రమండలి సభ్యులు

పిఠాపురం: 'ఆపరేషన్ సింధూర్'లో భాగంగా పాకిస్తాన్ సరిహద్దుల్లో శత్రు సైనికులతో పోరాడుతూ వీరమరణం పొందిన తెలుగు జవాన్ మురళి నాయక్‌కు సహృదయ మిత్రమండలి సభ్యులు, విద్యార్థులు ఆదివారం ఘన నివాళులు అర్పించారు. స్థానిక సూర్యరాయ గ్రంథాలయంలోని చెలికాని భావనరావు సభా సదన్‌లో మిత్రమండలి సభ్యులు వేసవి శిక్షణా శిబిరంలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు వీర జవాన్ చిత్రపటానికి పుష్పమాలలు సమర్పించి అంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో మిత్ర మండలి అధ్యక్షుడు తోట శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు పోతుల శ్రీనివాసు, సీనియర్ సభ్యులు కేవీవీ ప్రసాద్, కొమ్మనాపల్లి అప్పారావు, మహిళా కార్యదర్శి పావని, పోలీస్ కానిస్టేబుల్ కరుణకమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

దుర్గాడ శివాలయంలో శాంతి పూజలు



భారతదేశం చిత్రపటంతో ప్రత్యేక పూజలు

పిఠాపురం: గొల్లప్రోలు మండలం దుర్గాడ ఉమా రామలింగేశ్వర ఆలయ ప్రాంగణంలో వైశాఖ మాసం, పౌర్ణమి ముందుగా వచ్చే ఆదివారం సందర్భంగా సూర్య భగవానుడికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు చెరుకూరి వీరబాబు, దత్తు సోదరులు పండిత బృందంతో ప్రత్యేక సంకల్పంతో భారతదేశం ఔన్నత్యం, సాంప్రదాయాలు, అభివృద్ధి ముందుకు తీసుకు వెళ్లాలని కోరుతూ శాంతి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా 'దేశం తర్వాత ఏదైనా అని' సూర్య నమస్కారాలు నిర్వహించారు. ఆలయ సేవా సమితి బృందం వారు మాట్లాడుతూ శాంతి సామరస్యంతో ఉన్న పొరుగు దేశం కవ్వింపు చర్యలతో ముందుకు రావడంతో యుద్ధం మొదలైందని ఇరు దేశాలు తాత్కాలికంగా శాంతి ఒప్పందాలు జరగడంతో ఈ పూజలు నిర్వహించామని తెలిపారు. భారతదేశంలో ప్రజలందరు ఆ సూర్య భగవానుడి ఆశీస్సులతో సుఖ సంతోషాలతో జీవించాలని ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు వారు తెలిపారు. పలువురు భక్తులు సూర్యనమస్కార పూజల్లో పాల్గొని స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

కాండ్రకోట నూకాలమ్మకు పూజలు



నూకాలమ్మ అమ్మవారు



నూకాలమ్మ అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా పేరొందిన పెద్దాపురం మండలం కాండ్రకోట నూకాలమ్మ అమ్మవారి దర్శనానికి ఆఖరి ఆదివారం భక్తులు పోటెత్తారు. కొత్త అమవాస్య మాసం పురస్కరించుకుని సుమారు 45 రోజుల పాటు నిర్వహించే జాతర మహోత్సవాల్లో భాగంగా ఆలయ ఈఓ ఆర్.సౌజన్య, ఉత్సవ ప్రత్యేకాధికారి వడ్డి శ్రీనివాస్ ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నారు. సుదూర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలతో తరలిరావడంతో ఆలయం భక్తులతో కిటకిటలాడింది. పెద్దాపురం సీఐ విజయ్ శంకర్ పర్యవేక్షణలో ఎస్ఐ మౌనిక ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్తు కల్పించారు. సుమారు వేల సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. పలు స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో యాత్రికులకు మజ్జిగ, పాలు పంపిణీ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పంచారామ క్షేత్రంలో కార్తికేయ మిశ్రా పూజలు



కార్తికేయ మిశ్రా దంపతులకు స్వామివారి ఫొటో అందజేస్తున్న ఆలయ సూపరింటెండెంట్

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరి సమేత కుమారా రామభీమేశ్వర స్వామి ఆలయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి అడిషనల్ సెక్రటరీ కార్తికేయ మిశ్రా కుటుంబ సభ్యులు ఆదివారం రాత్రి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయానికి వచ్చిన వారికి ఈఓ బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆలయంలోని కాలభైరవ స్వామి, ధ్వజస్తంభం, పెద్ద నంది, మూల విరాట్, ఉప ఆలయాలను దర్శించుకున్న మిశ్రా కుటుంబ సభ్యులు స్వామివారికి అమ్మవార్లకు పూజలు చేశారు. పూజలు అనంతరం ఆలయ పండితులు ఆశీర్వచనాలు అందజేశారు. ఆలయ సూపరింటెండెంట్ ఈశ్వరరావు వారి స్వామి వారి ఫొటో, ప్రసాదం అందజేశారు.

ఘనంగా ముత్యాలమ్మ జాతర

కొత్తపల్లి: గ్రామ దేవత ముత్యాలమ్మ తల్లి జాతరను ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. గరగ నృత్యాలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. జాతర సందర్భంగా ఆలయాన్ని విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరించారు. సోమవారం అమ్మవారి తీర్థాన్ని ఘనంగా నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులకు అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

అమ్మ ప్రేమ మరువలేనిది



వేసవి శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న నాగరాజు

పెద్దాపురం: తల్లి ప్రేమ ఎన్నడూ మరువలేనిదని గ్రంథాలయాధికారి పాలంకి నాగరాజు అన్నారు. పెద్దాపురం శాఖా గ్రంథాలయంలో నిర్వహించే వేసవి శిక్షణా తరగతుల్లో భాగంగా ఆదివారం మాతృ దినోత్సవాన్ని పురస్కరించుకుని అమ్మ త్యాగంపై విద్యార్థులకు వివరించారు. గ్రంథాలయాల్లో పుస్తక పఠనం ద్వారా విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చని, శాఖా గ్రంథాలయంలో నిర్వహించే వేసవి శిక్షణా తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని, విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలును వెలికి తీసేందుకు ఈ శిక్షణా తరగతులు ఎంతగానో దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో సింగం బుల్లియ్య, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పిఠాపురంలో జిల్లా 3వ ఓపెన్ తైక్వాండో పోటీలు



పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

పిఠాపురం: స్థానిక భాష్యం హైస్కూల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా 3వ ఓపెన్ తైక్వాండో పోటీలు ఆదివారం నిర్వహించారు. ఈ పోటీలను పిఠాపురం జనసేన పార్టీ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు ప్రారంభించారు ఈ పోటీలకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నల మూలల నుంచి 200 మంది బాలబాలికలు పాల్గొన్నారు. పోటీల అనంతరం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా రగ్బి అసోసియేషన్ చైర్మన్ రమన్న రాజు, సభ్యులు ఇమ్మిడి శెట్టి నాగేంద్ర కుమార్ చైతన్య, పోటీలో నిర్వహణ కార్యదర్శి పి.లక్ష్మణరావు, కౌన్సిలర్లు అల్లవరపు నగేష్, రాయుడు శ్రీనివాసరావు బహుమతి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా భాష్యం స్కూల్ విద్యాసంస్థలు చైర్మన్ భాష్యం రామకృష్ణ, జోనల్ ఇన్‌చార్జి గోవిందరాజులు, పిఠాపురం భాష్యం స్కూల్ ప్రిన్సిపాల్ వేణు విజేతలను అభినందించారు.

భానుడి భగభగలు



ఎండ తాపానికి తలకు క్లాత్‌లు కట్టుకొని ప్రయాణిస్తున్న వాహనచోదకులు



నిర్మానుష్యంగా సామర్లకోట ఫ్లైఓవర్ బ్రిడ్జి

- మండుతున్న ఎండలు
- నిర్మానుష్యంగా ప్రధాన రోడ్లు

సామర్లకోట: ఈ ఏడాది వేసవి ప్రారంభం నుంచి ఎండలు మండిపోతున్నాయి. భానుడు భగ్గుమంటున్నాడు. ఆదివారం ఉదయం 8 గంటల నుంచి ఎండలు ఎక్కువగా ఉన్నాయి. సాయంత్రం ఆరు అయినా ఎండ వేడి తగ్గకపోవడంతో పాటు వేడి గాల్పులు వీస్తున్నాయి. దాంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఒక వైపు ఎండలు మండిపోవడంతో ఏదో ఒక సాకుతో విద్యుత్ సరఫరా నిలిపివేస్తుండడంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. స్టేషన్ సెంటర్‌లోని మున్సిపల్ షాపులలోనికి నేరుగా ఎండ వస్తుంది. దాంతో తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

ఆదివారం 40 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు అయింది. దాంతో నిత్యం రద్దీగా ఉండే స్టేషన్ సెంటర్, ఫ్లైఓవర్ బ్రిడ్జిపై రాకపోకలు కనిపించలేదు. చిన్నారులు, వృద్ధులు వేడి గాల్పులకు తాళలేక అస్వస్థతకు గురవుతున్నారు. జూన్ 8 వరకు ఎండ తీవ్రత ఉంటుందని అధికారులు హెచ్చరిస్తున్నారు. ప్రజలు వారి వారి విధులు పూర్తి చేసుకొవడానికి, వివాహాలకు ఎండను ఎక్క చేయకుండా వెళ్లవలసిన పరిస్థితులు ఏర్పడుతున్నాయని ప్రయాణికులు తెలియజేస్తున్నారు. దాంతో తలకు గుడ్డలు కప్పు కొని వాహనాలపై రాక పోకలు సాగిస్తున్నారు. ఎండలు ఎక్కువగా ఉండటంతో వివిధ రకాల పండ్ల జ్యూస్‌లు, చెరుకు రసం, కొబ్బరి బొండాలు ఎక్కువగా డిమాండ్ ఏర్పడింది.

రీసెర్చ్ కాన్‌క్లేవ్-2025పై సదస్సు



సదస్సును ప్రారంభిస్తున్న అతిథులు

బాలాజీచెరువు: జేఎన్‌టీయూకే రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ డైరెక్టరేట్ ఆధ్వర్యంలో ఆదివారం రీసెర్చ్‌కాన్‌క్లేవ్-2025 అంశంపై సదస్సు నిర్వహించారు. ఆర్అండ్‌డీ డైరెక్టర్ రవీంద్ర ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సుకు ముఖ్య అతిథిగా కార్గోల్యాబ్ సీఈఓ డాక్టర్ ఎం.యోగేశ్వరరావు హాజరై పరిశోధన శక్తి అనే అంశంపై పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా రీసెర్చ్‌స్కాలర్‌కు అవగాహన కల్పించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సు ప్రారంభించారు. పరిశోధన విభాగానికి సంబంధించి పేపర్ ప్రంజటేషన్‌లో 2017 నుంచి 2022 వరకూ ప్రపంచ వ్యాప్తంగా చైనా, అమెరికా దేశాలు మొదటి రెండు స్థానాల్లో ఉండగా 1,91,590 పేపర్స్‌తో భారతదేశం నాలుగో స్థానంలో ఉందన్నారు. జేఎన్‌టీయూకే వీసీ డాక్టర్ సీఎస్ఆర్‌కే ప్రసాద్, ఆర్అండ్‌డీ డైరెక్టర్ వి.రవీంద్ర మాట్లాడుతూ పరిశ్రమ, విద్యాసంస్థలు, పరిశోధక విద్యార్థుల మధ్య అంతరాన్ని తగ్గించడానికి, వినూత్న పరిశోధన, సహకారాన్ని ప్రోత్సహించడానికి రీసెర్చ్‌కాన్‌క్లేవ్ నిర్వహించామన్నారు. సాంకేతిక అభివృద్ధి సాంకేతిక స్థిరత్వం ద్వారా ప్రపంచ వ్యాప్తంగా 40 శాతం ఎగుమతులు చేస్తుందన్నారు. రీసెర్చ్‌స్కాలర్‌కు త్వరలో యూనివర్సిటీలో సెంట్రలైజ్డ్ రీసెర్చ్ సదుపాయం, లైబ్రేరీ, మ్యాట్‌ల్యాబ్ సాఫ్ట్‌వేర్ వంటి సదుపాయాలు కల్పిస్తామన్నారు. ఈ సదస్సుకు 210 మంది హాజరు కాగా 110 మంది పోస్టర్ ప్రజంటేషన్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ రవీంద్ర, ప్రిన్సిపాల్ మోహనరావు, కో-ఆర్డినేటర్లు ఎ.గోపాలకృష్ణ, కృష్ణప్రసాద్, బీటీ కృష్ణ పాల్గొన్నారు.